భాస్కరం పేపరుతీసి "పంచాయతీలరాజ్యమే కావాలి!" అని చదివి ఇలా అనసాగాడు. "మన పంచాయతీబోర్డు సంగతి ఈ నాయకులకు తెలిసి నట్టయితే ఇలా అనివుండేవారు కాదు. ప్రస్తుతం పంచాయతీల పాలనలో వుండే కుళ్లూ స్వార్థం యిక యెందులోనూ కనిపించదు. మా యింటి ముందు దీపం వేయించాలనీ మా కుండీ బాగుచేయించాలనీ ఘోషిస్తారేకాని మన ప్రజలకు అవసరమైనవేమిటి? గ్రామం శుభ్రంగా వుంటున్నదా? లేదా? మనం చేయవలసిన పనులేమిటి అని ఆలోచించే వాళ్లెవరూ లేరు. ప్రతిబోర్డుకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లని కొందరిని నియమించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరంటే చట్టబద్ధంగా నడిపించే ఉద్యోగి అని అర్థం. కానీ వీరు దీపంవుండగానే......"

ఇంతలో లారీ ఒకటి వాయువేగంతో వచ్చి మా బడిముందు ఆగింది. రిజర్వు పోలీసులు బిలబిలలాడుతూ లారీలోంచి దిగి మమ్మల్ని చుట్టుముట్టారు! ఇనస్పెక్టరు మమ్మల్ని సమీపించి "మీరంతా లారీ యెక్కండి!" అన్నాడు.

"ఎందుకు?"

"ప్రజల్ని రెచ్చగొడుతున్నందుకు!" టోపీ సర్దుకుంటూ సమాధానం చెప్పాడు ఇనస్పెక్టరు.

"అనకూడదుగాని బాబూ! యిదంతా ఆ సుబ్బయ్యగారు......"

"ఛప్! యెక్కు!" లాఠీ ఛెళ్ మంది.

# అవనీమాతవలె....

ఈ వార్త నిజమే. సరోజినీదేవి మరణం! ప్రపంచంలో జరిగే అనేక సంఘటనలతో బాటు ఆమె కాలధర్మాన్ని కూడా పత్రికలు యథావిధిగా ప్రకటించాయి. కాని ఇది అంతగా విశ్వసించనక్కరలేని వార్త. సరోజినీదేవి ఫలానా రోజున జన్మించి ఫలానా తేదీని మరణించిందని చావుపుట్టుకల జాబితా వేసుకోవడానికి మాత్రం పనికొస్తుంది ఈ వార్త. అజరామరమైన సరోజినీదేవి జీవితగాథకి భౌతికమరణం ఒక అశ్వాసాంతం కానేకాదు. పత్రికలు ప్రకటించిన వార్తనికాదని ఖండించకుండా, ఆమె ఇంకా జీవిస్తూనే ఉందని ఖండితంగా చెప్పవచ్చు.

ఆమె చిత్రపటాన్ని కూడా అన్ని పత్రికలూ ప్రకటించాయి. ఆ బొమ్మని చూసినవాళ్ళందరూ సరోజినీదేవికి ముసలితనం వచ్చిందని భ్రమపడవచ్చు. ఆబొమ్మ ఇచ్చే సాక్ష్యంలో కూడా అబద్ధంలేదు. స్థూలదృష్టికి సరోజినీదేవి వృద్ధురాలుగానే కనపడవచ్చు. ఆ సత్యాన్నే కెమేరా రికార్డు చేసింది. అయితే అంతకన్న అగాధమైన సత్యం ఇంకొకటి ఉంది. అది అసలు వయస్సే లేని ఆమె ఆత్మ. ఎవరూ దాని నిప్పటికీ ఫొటో తియ్యలేదు. కాని అందరి మనస్సులలోనూ అది హత్తుకుపోయిందని చెప్పవచ్చును.

ఫొటోలోకి చూస్తూ, పత్రికా వార్త చదువుతూ ఒక ఆరముగ్గిన పండు రాలిపోయిందని అనుకుంటాము జననం 1879, మరణం 1949. డెబ్భయి సంవత్సరాల జీవితం అని లెక్కవేసుకుంటాము. ఈ లోపున ఆమె జీవితంలోని ప్రధాన ఘట్టాలన్నింటినీ ఒక్కసారి స్మరణకి తెచ్చుకుంటాం. పదకొండో యేటనే పద్యం రాయడం, బ్రాహ్మణేతరునితో వివాహం, సాంస్కృతిక సాంఘిక రాజకీయరంగాలలో దేదీప్యమాన విహారం, కాంగ్రెస్ కిరీటం, చెరసాలలు, గుండ్రబల్లలు, ఉప్పు సత్యాగ్రహం, ప్రపంచయుద్ధం రావడం పోవడం, స్వరాజ్యం రావడం, గవర్నరు పదవి ఇత్యాదులు. ఇటీవల ఆమె పరమపదించిందన్న వార్త ఆమె జీవితగాథలో అంతగా పాటించనక్కరలేని ఒక చిల్లర వివరం.

అందంగా, ఆకుపచ్చగా అవనీమాతలాగ సరోజినీదేవి శాశ్వతంగా మనలోనే ఉంటుంది.

శ్రీ. శ్రీ